క్లుప్తంగా

రూ.1.40లక్షల ఆర్థికసాయం



బయ్యారం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని గంధంపల్లికి చెందిన ఉపాధ్యాయుడు సంద్ర ఉపేందర్‌రావు కుటుంబానికి గంగారం, కొత్తగూడ, గూడూరు మండలాలకు చెందిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శనివారం రూ.1.40లక్షల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణ కుమారి, వీరస్వామి, శ్రీనివాస్, కృష్ణ, ప్రభాకర్, రాంచందర్, నరసింహరావు, భాస్కర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

రూ.16,400ల ఆర్థికసాయం

గార్ల: గార్లలోని విశ్వశాంతి విద్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న రాజేశ్వరి భర్త రాంబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో, పాఠశాల కరస్పాండెంట్లు పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, బీరవెల్లి సంజీవరెడ్డిలు రూ.16,400 నగదును అందజేశారు.

శంకుస్థాపన



బయ్యారం: మండలంలోని నారాయణపురం, కంబాలపల్లి, అల్లిగూడెం, కారుకొండ, కొత్తపేట పంచాయతీల్లో పలు సీసీ రోడ్ల నిర్మాణాలకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం గంధంపల్లి–కొత్తపేటలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఇల్లందు ఏఎంసీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంఈఓ దేవేంద్రాచారి, నాయకులు పాల్గొన్నారు.

ఏటీఏ కమిటీ ఎన్నిక



వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు

గంగారం: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జజ్జరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పెనక ప్రేమ్ సాగర్, ఉపాధ్యక్షుడిగా చుంచ రమేశ్, కోశాధికారిగా సోలం సంతోష్‌కుమార్, కార్యదర్శులుగా గుమ్మడి వెంకటలక్ష్మి, ధనసరి శాంత, ముడిగ రమేశ్, ముడిగ సుధాకర్‌లను ఎన్నుకున్నారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

కేసముద్రం: పంజాబ్ రాష్ట్రంలో ఈనెల 11నుంచి 14వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు మండలంలోని సబ్‌స్టేషన్‌తండాజీపీలో గల సెయింట్ జాన్స్ హైస్కూల్‌కి చెందిన దారావత్ సంజయ్ అనే విద్యార్థి ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రావణ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ వెంకటేశ్వర్లు, రాంజీ తెలిపారు.

విలీన గ్రామాల్లో గ్రామసభలు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విలీన గ్రామాలైన కేసముద్రంస్టేషన్, కేసముద్రంవిలేజ్, అమీనాపురం, ధన్నసరి, సబ్‌స్టేషన్‌తండాజీపీ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ క్రాంతి తెలిపారు. ఈ మేరకు డీపీఓ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని పార్వతి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రంగావఝుల సుధాకరశాస్త్రిసునీత దంపతులు, చిట్టా శ్రీకాంత్ శాస్త్రి శనివారం కల్యాణం నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

కునుకు ఇలా.. తనిఖీలు ఎలా



దంతాలపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అధికారులు విధులపై నిమగ్నమై తనిఖీలు చేస్తుంటే ఓ అధికారిణి మాత్రం తనకు ఏమి తెలియదు అన్నట్లుగా వేదికపై కునుకు తీశారు.

ఎస్సైపై సస్పెన్షన్ వేటు

జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ఎస్సై బి.రాణాప్రతాప్‌ను సస్పెండ్ చేస్తూ డీఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తించిన సమయంలో ఓ కేసు విషయమై అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఆయన కోర్టుకు తప్పుడు సమాచారం అందించినట్లు తేలింది. దీంతో తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.

ఆటుపోట్లు ఎదుర్కొని పథకాల అమలు

- ఎమ్మెల్యే భూక్య మురలీనాయక్
- సీఎం కప్ క్రీడలు ప్రారంభం

కేసముద్రం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదికాలంలో ఎన్నో ఆటుపోట్లను, ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొని ఇచ్చిన హామీల ప్రకారంగా పథకాలను అమలు చేసిందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. శనివారం మండలంలోని అమీనాపురం గ్రామంలో సీఎం కప్ కార్యక్రమంలో భాగంగా క్రీడలను, వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను, కొత్తగా ఏర్పాటైన చంద్రుతండాజీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం రైతువేదిక భవనంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభలో మాట్లాడారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌లను ఏర్పాటు చేసిందన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు నాణ్యమైన అల్పాహారాన్ని అందించాలని ఆయన అన్నారు. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఎంపీడీవో క్రాంతి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎర్రయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు వెంకన్న, గుగులోతు దస్రూనాయక్, కదిర సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం: అమీనాపురంలో కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

క్రీడలతో ఆరోగ్యం

మహబూబాబాద్ రూరల్: క్రీడలతో విద్యార్థులు, యువతకు ఎంతగానో మేలు కలుగుతుందని ఎంపీడీఓ రఘుపతిరెడ్డి అన్నారు. మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో సీఎం కప్ క్రీడలను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సక్రు, పీడీ మోహన్ నాయక్, కార్యదర్శి విక్రం, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, రాజు, హనుమంతు, దేవు, అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గార్ల: గార్లలో సీఎం కప్ క్రీడాపోటీలను శనివారం ఎంపీడీఓ మంగమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్, ఎంఈఓ పూల్‌చంద్, నాయకులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, గుండా వెంకట్‌రెడ్డి, భూక్యా నాగేశ్వరరావు, కందునూరి శ్రీనివాసరావు, మండా రాముగౌడ్, హెచ్‌ఎంలు ఎం.శివ, పి.నాగేశ్వరరావు, కార్యదర్శి అజ్మీర కిషన్, పీఈటీలు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: క్రీడాకారులతో ఎంపీడీఓ రఘుపతిరెడ్డి

క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే..

పెద్దవంగర: యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వేణుమాధవ్, ఎంఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాలతోపాటు ప్రభుత్వ పాఠశాల్లో సీఎం కప్ పోటీలను ప్రాంభించారు.

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజ్) జెడ్పీ హైస్కూల్‌లో సీఎం కప్ గ్రామ పంచాయతీ లెవల్ క్రీడలను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జానయ్య, పీడీ కమల్‌కిశోర్, ఉపాధ్యాయులు రఘువేందర్, భద్రు, మహేష్, యాదగిరి, స్వర్ణ, రమ పాల్గొన్నారు.



గార్ల: క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ మంగమ్మ



పెద్దవంగర: విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ

ప్రభుత్వ భూముల వివరాల సేకరణ

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీతోపాటు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల గుర్తింపు కోసం రెవెన్యూ సిబ్బంది సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. డోర్నకల్, అమ్మపాలెం సరిహద్దులోని పలు సర్వే నంబర్లలో భూములను శనివారం చైర్మన్ వీరన్న పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సహకారంతో ప్రభుత్వ భూముల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు మాదా శ్రీనివాస్, బోడ హరిలాల్, అఖిల్ ఖాన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

గూడూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్ల జీవనం రోడ్డున పడిపోతుందని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బానోతు హరినాయక్, దుర్గాల సోమశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శనివారం రాష్ట్ర వ్యాప్త ఆటోల బంద్ కార్యక్రమంలో భాగంగా బస్టాండ్ సెంటర్‌లో మండలంలోని ఆటోలను ఒకచోట నిలిపి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటో యజమానులకు మార్గం చూపి ఆదుకోవాలని తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం అందించారు.

మాతాశిశు సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే భూక్య మురలీనాయక్

మహబూబాబాద్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించి అమ్మమాటతో వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని నడివాడ గ్రామంలో అంగన్‌వాడీ పిల్లలకు ఎమ్మెల్యే మురళీనాయక్ శనివారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు భోజనం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోపాటు పాలు, గుడ్లు అందించాలని తెలియజేశారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆడుతూ పాడుతూ నీతి కథలు, పాఠాలు నేర్పించి మూస విధానంతో కొనసాగే బోధనకు స్వస్తి పలకాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాతాశిశు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మిట్టకంటి రామిరెడ్డి, కొత్త హేమంత్, రాగిపాటి బుచ్చిరెడ్డి, మైదం శివప్రసాద్, లింగ్యానాయక్, మధుసూదన్ రెడ్డి, వెంకన్న, ఇంద్రారెడ్డి, మల్లేష్, ఐసీడీఎస్ పీడీ ధనమ్మ, సీడీపీఓ శిరీష, టీచర్ స్వరూప, ఆయా వెంకటమ్మ పాల్గొన్నారు.



యూనిఫాం పంపిణీ చేసిన ఎమ్మెల్యే మురళీనాయక్

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



పొలంబాటలో పాల్గొన్న రైతులు, అధికారులు

పెద్దవంగర: విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని డీఈ మధుసూదన్, ఏడీఈ చలపతిరావు అన్నారు. శనివారం మండలంలోని రాజ్‌మాన్‌సింగ్ తండాలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం చేపట్టారు. రైతుల విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా పొందేందుకు రైతులు తమ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. సాంక్షన్ లేని మోటార్లకు లైన్‌మెన్‌ను సంప్రదించి రూ.5,100 చెల్లించి రెగ్యూలర్ చేసుకోవాలన్నారు. చెల్లించిన నగదుకు వెంటనే రశీదు పొందాలన్నారు. రూ.938 చెల్లించి 200 యూనిట్ల గృహజ్యోతి పథకంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం చిన్నవంగర ఫీడర్‌పై నూతనంగా ఏర్పాటు చేస్తున్న 33 కేవీ, ఏబీ స్విచ్ పనులను ఈఏ రమేష్‌బాబుతో కలసి పరిశీలించారు.

భవిష్యత్ తరాల కోసమే రాజ్యాంగం

- కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు

నెల్లికుదురు: భవిష్యత్ తరాల కోసమే బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రచించాడని, బహుజనులంతా రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఒక్క తాటిపై నిలవాలని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు పిలుపు నిచ్చారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో బహుజన చైతన్య వేదిక కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పాలనలో రాజ్యాంగాన్ని మార్చి బహుజనులకు రావల్సిన హక్కులను అందకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. దాన్ని తిప్పికొట్టేలా బహుజనులంతా ఏకం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోడిచింతల రాజు, ఎస్సై చిర్ర రమేశ్ బాబు, ఎంపీడీఓ పద్మ, మహేందర్, బాలాజీ, వెంకటేష్, సైదులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న బహుజనులు

చాప్టర్ల వారీగా పరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: విద్యార్థులకు సబ్జెక్ట్‌ల్లో చాప్టర్ వారీగా పరీక్షలు నిర్వహించాలని డీఈఓ రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను డీఈఓ శనివారం సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్ బాబు, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, ఉప్పలయ్య, సోహెన్ శ్రీధర్ రెడ్డి, కాసం శ్రీనివాసరావు, తిరుపతి, శిభారాణి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

కురవి: పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని డీఈఓ రవీందర్‌రెడ్డికి శనివారం తెలంగాణ గిరిజన సంఘం నాయకులు వినతిపత్రం హైస్కూల్‌లో అందజేశారు. అలాగే కురవిలో మనబడి–మన ఊరు పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జ్యోతిబసు, వీరేందర్‌లు డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేసి ఆదుకోవాలని రాష్ట్ర బీఈడీ నిరుద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సలవది పాండు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లెలిన్ వత్సల్ టొప్పోకు శనివారం బీఎడ్ నిరుద్యోగుల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను వంద శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. ఎస్జీ ఉపాధ్యాయులకు ఇస్తున్న 70 శాతం పదోన్నతుల కోటను రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో వేలాది మంది బీఎడ్ శిక్షణ పూర్తి చేసి ప్రైవేట్ పాఠశాలలో అరకొర వేతనంతో కష్టపడి పనిచేస్తున్నారని, అన్ని అర్హతలు ఉన్న బీఎడ్ నిరుద్యోగులకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కిరణ్ కుమార్, చట్ల శ్రీనివాస్, ఐలేశ్వర్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నేటినుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీతోపాటు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు కోసం ఆదివారం నుంచి సర్వే ప్రారంభం కానుంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యదర్శులకు, మున్సిపల్ వార్డు అధికారులకు లబ్ధిదారుల ఎంపిక సర్వేకు సంబంధించిన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఆదివారం నుంచి కార్యదర్శులు, వార్డు అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో మొబైల్ యాప్ ద్వారా వివరాలు సేకరించనున్నారు.

ఆత్మహత్యపై విచారణ జరిపించాలి

నెహ్రూసెంటర్: గూడూరు మండలంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఆత్మహత్యపై విచారణ జరిపించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ డిమాండ్ చేశాడు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి ఆరోగ్య స్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌లపై చర్య తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి భూక్య జగన్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

తొర్రూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: తొర్రూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో 10వ వార్డులో రూ.15లక్షల టీయూఎఫ్ ఐడీసీ నిధులతో నిర్మించనున్న గౌడ కమ్యూటీ హాల్ భవన నిర్మాణ పనుల ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మున్సిపాల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ దొంగరి రేవతి, నాయకులు సుంచు సంతోష్, సోమరాజు శేఖర్, అచ్చిరెడ్డి,పెద్దగాని సోమయ్య, విజయపాల్‌రెడ్డి, చాపల బాపురెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- ఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ

మహబూబాబాద్ అర్బన్: సమగ్రశిక్షలో 15 సంవత్సరాలు విధుల నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.మురళీకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు రిలే నిరసన దీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. న్యాయం జరిగే వరకు కాంట్రాక్ట్ ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళి వీరన్న, నాయకులు జానకి రాముడు, ఖాదర్, సాగర్, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీకృష్ణ

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: మార్కిస్టు మహోపాధ్యాయులు లెనిన్ శత వర్ధంతి సందర్భంగా నేడు జిల్లా కేంద్రంలో జరగనున్న శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి శనివారం పిలుపునిచ్చారు.

నేటినుంచి తరగతులు ప్రారంభం

గార్ల: గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ అభ్యర్థులకు నేటి నుంచి తరగతులు ప్రారంభం అవుతున్నట్లు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు శనివారం తెలిపారు.

సన్మానం

మహబూబాబాద్ అర్బన్: ఇటీవల పోలీస్ శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగం సాధించిన దర్శనం నాగార్జునను మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం సన్మానించాడు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బొడ్డుపల్లి శ్రీనివాస్, రజిత, మాధురి, న్యాయవాది దర్శనం రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో మాక్ పోలింగ్‌ను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నర్సింహరాజు, నర్సింహస్వామి, శ్రీను పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి షష్టి వేడుకలు

డోర్నకల్: మండలంలోని తొడేళ్లగూడెం గ్రామ శివారు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం షష్టి వేడుకలు జరిగాయి. అయ్యప్పమాల ధరించిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

గూడూరు: ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య అన్నారు. మండలంలోని లైన్ తండాలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) ప్రజాపంథా ఆధ్వర్యంలో సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఈరెల్లి మల్లేష్, లింగాల రాజు, ఎల్లగౌడ్, సురేష్, చంద్రు, వెంకన్న, శ్రీను, రవి, వీరన్న పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల మహిళలకు ప్రగతి సేవాసమితి ఆధ్వర్యంలో అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రగతి సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల జాను కోరారు. స్థానిక ప్రగతి సేవాసమితి కార్యాలయంలో మండలంలోని రాజులకొత్తపల్లిలో, నైనాలలో, నర్సింహులగూడెంలో, చిన్ననాగారంలో లబ్ధిదారులకు రుణాలుగా అందించారు.

సోమశేఖర్ స్థూపం ఆవిష్కరణ సభ



పెద్దవంగర: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకుడు జలగం సోమశేఖర్ చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం రాష్ట్ర నాయకుడు బుద్ధ భిక్షమయ్య, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు నున్న అప్పారావు అన్నారు. మండలంలోని చిన్నవంగర గ్రామంలో శనివారం సోమశేఖర్ స్థూపావిష్కరణ సభను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాజేశ్వరి, సబిత, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఐలయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య, నగేష్, వెంకన్న పాల్గొన్నారు.

రామచంద్రు సేవలు మరువలేనివి

మహబూబాబాద్ రూరల్: సీపీఐ సీనియర్ నాయకుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి తండా రామచంద్రు సేవలు మరువలేనివని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అజయ్ సారథిరెడ్డి అన్నారు. మండలంలోని ముడుపుగల్ గ్రామంలో రామచంద్రు వర్ధంతి సభ శనివారం నిర్వహించారు. అనంతరం రక్త దానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నితీష్, కిరణ్ సురేష్, తండ సందీప్, తండ సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రచార వాహనం అడ్డగింత

మహబూబాబాద్ రూరల్: హిందువుల పవిత్ర గ్రంథమైన భగవద్గీతను మార్చి ఓ రచయిత ద్వారా పుస్తకాన్ని ప్రచురణ చేసి జిల్లా కేంద్రంలో అన్యమత ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దార ఇందుభారతి శనివారం ప్రచారాన్ని అడ్డుకున్నారు. సదరు వాహన ప్రచార నిర్వాహకులతో వాగ్వాదం దిగి వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ వారికి కౌన్సిలింగ్ నిర్వహించి పంపించారు.

ఇద్దరిపై కేసు నమోదు

నర్సింహులపేట: మండలంలోని వంతడపల గ్రామానికి చెందిన ఉపేందర్, మహేష్‌లపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. రెండు రోజుల క్రితం గ్రామంలో జరిగిన పెళ్లి భరత్‌లో గ్రామానికి చెందిన కమటం వెంకన్న, లింగన్నపై ఉపేందర్, మహేష్ దాడి చేశారు. వెంకన్న ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేంద్ర మంత్రికి వినతి

డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం గ్రామపరిధిలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు కాపరబోయిన సత్యనారాయణ శనివారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందించారు.

ఇందిరమ్మ ఇళ్ల లాగిన్‌పై అవగాహన

దంతాలపల్లి: ప్రభుత్వం తలపెట్టిన పేదవారికి సొంతింటి కల నెరవేర్చే ఇందిరమ్మ ఇళ్ల లాగిన్‌పై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దారు కాటం చంద్ర రాజేశ్వర్ అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శులు లాగిన్‌ను నేటినుంచి తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

మహబూబాబాద్ అర్బన్: పాఠశాలలో దివ్యాంగ పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ మమత, ఉపాధ్యాయులు గిరిజ, వంసత, విజయలక్ష్మి, రంజాన్ అలీ, రమేశ్, పద్మావతి, వీణ పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

గార్ల: స్థానిక ఎంపీఓ కార్యాలయం ప్రాంగణంలో దివ్యాంగుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంగమ్మ, డీటీ జర్పుల సుధాకర్, ఎంఈఓ వీరభద్రం పాల్గొన్నారు.

దొడ్డురకం ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్: రైతులు పండించిన సన్నరకం ధాన్యంతో పాటు దొడ్డురకం ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షులు తాజ్ పాషా అన్నారు. ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపురం (బి) గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో హరీష్, ఎల్లయ్య, చారి విమల, వెంకన్న, రాజు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



దంతాలపల్లి: ఉపాధి పనులపై అధికారులు జాగ్రత్తగా ఉండాలని డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు అన్నారు. 2023 ఏప్రిల్ 1నుంచి, 2024 మార్చి31 వరకు మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.3.69లక్షల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించామన్నారు. డబ్బులను రికవరీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ వీరబాబు, ఆదాం, డీఈ పుష్పలత, ఎంపీడీఓ వివేక్‌రామ్, పాల్గొన్నారు.